ABN ఆంధ్రజ్యోతి 21 March 2023

# కేజ్ కల్చర్ మరింత విస్తరణ

## ఐసీఏఆర్-సీఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణన్

**విశాఖపట్నం, మార్చి 20(ఆంధ్రజ్యోతి):** విశాఖపట్నంలో కేజ్ కల్చర్‌ని మరింత విస్తరించామని, ఇది మత్స్యకారుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్)-సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి సెంటర్(సీఎంఎఫ్ఆర్ఐ) కోచి డైరెక్టర్ ఏ.గోపాలకృష్ణన్ అన్నారు. ఆర్కే బీచ్‌లోని సీఎంఎఫ్ఆర్ఐ కార్యాలయంలో రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్(ఆర్ఏఎస్)ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ఆరు మీటర్ల వ్యాసార్థం కలిగిన కేజ్‌లలో చేపలను పెంచామని, ఇపుడు దీనిని 15 మీటర్లకు విస్తరించామన్నారు. ఇక్కడ తయారైన బ్రీడ్ చాలా నాణ్యమైనదని, తక్కువ ధరకు మత్స్యకార రైతులకు అందించగలుగుతామన్నారు. సుమారు 12 గ్రాముల చేపల విత్తనాన్ని కేవలం రూ.11.20కే ఇవ్వగలుగుతామన్నారు. ఇండియన్ పాంపెనోలను విశాఖలో కేజ్ కల్చర్ ద్వారా అభివృద్ధి చేశామని, త్వరలో తెల్లచందువాలు, నల్ల చందువాలు, ఖరీదైన గోల్డ్ ఫిష్‌లను కూడా పెంచడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ చేపల పెంపకంలో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు, వారు ఉండటానికి వీలుగా ఏర్పాటు చేసిన వసతి కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించారు. చేపల కోసం తయారుచేసిన రెండు రకాల ఫీడింగ్ ప్యాకెట్లను విడుదల చేశారు. ఇండియన్ పాంపెనో బ్రూడ్‌స్టాక్ అభివృద్ధి, విత్తన ఉత్పత్తి కోసం ఎంఎస్ఆర్ అక్వా సంస్థతో, కేజ్‌ఫార్మింగ్‌పై రేవతి బండారు సంస్థతో, సాంకేతిక సహకారం కోసం లయ ఎన్‌జీఓతో ఈ సందర్భంగా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం సెంటర్ పూర్వపు ఇన్‌చార్జి సుభాదీప్ ఘోష్, ప్రస్తుత ఇన్‌చార్జి చార్లెస్ జీవా తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఏఎస్ నర్సరీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ గోపాలకృష్ణన్